# మంచీ - చెడూ

**రామారావంటే నాకు అసహ్యం... కోపం ... జెలసీ.అఫ్‌కోర్స్ ఆ చివర్దే మొదటి రెండింటికీ ఆలంబన అనుకోవచ్చు. నాఅసూయను నేను మీ ముందు దాచుకోను. ఎందుకంటే నేను నా అసూయపట్ల గర్వపడతాను. నన్ను రారాజు సుయోధనుడితో పోల్చుకుని ఆనందిస్తాను.**

రామారావు నా కొలీగ్. ఇద్దరం ఒకేసారి వుద్యోగంలో ప్రవేశించేం. ఒకే డిపార్టుమెంట్లో పక్కా పక్కా సీట్లు మావి. కాని చూస్తుండగానే రామారావు నన్ను దాటేశాడు. నా కన్నా రెండు మెట్లు పైకెక్కి ఆఫీసు మాపర్నెంటు అయిపోయాడు.

రామారావు పట్ల నా జెలసీకి అదే ముఖ్య కారణం.

రామారావు నా దృష్టిలో ఇనెఫిషియెంట్, ఇన్‌డిసెంట్ అగ్లీ ఫెలో నిజానికి వాడో ఎఫిషియెంట్ హేండ్‌సం స్మార్ట్ గై.

ఆఫీసర్ల నోళ్ళ చివరుంటాడు రామారావు.

అతని సంసారం కూడా చూడ ముచ్చటైందే.

అనుకూలవతియైన రంభలాంటి భార్య. గవర్నమెంట్ రూల్సు పాటిస్తున్న గుర్తుగా ఐదేళ్ళ బాబు, ఏణ్ణర్థం పాప.

ఆర్థిక బాధల్లేని ఆదర్శకుటుంబం.

నాలోని అసూయ పురుగు దొలుస్తూ...దొలుస్తూ రామారావుమీద ప్రతీకారం తీర్చుకోమంటోంది.

ఎంతో చిన్నపాటి నష్టాన్నైనా కలగచేయమంటోంది.

దాని ఫలితంగానే -

ఆ మధ్య వాడి సువేగా స్ప్రైటోలు పైపుపీకేశాను, ఎవరూ చూడకుండా.

మర్నాడు వాడి సీటుకి గ్రీసు పూసేను.

లెటరు బాక్సులోంచి వాడి వుత్తరాలని కాజేసి చింపి పారేసేవాణ్ణి. ఇంకా... ఇంకా వాడి నాన్నకి హార్టెటాకొచ్చిందనీ, వాళ్ళ మావగార్కి పెరాలిసిస్ స్ట్రోక్ వొచ్చిందనీ ఫేక్ టెలిగ్రాంలు ఇచ్చేవాణ్ణి. వాడు లబోదిబో మంటూ పరిగెడుతూంటే మనసులో ఆనందాన్ని అనుభవిస్తూ భయం లేదని పైకి ధైర్యం చెప్పేవాణ్ణి.

వాడికయ్యే డబ్బు ఖర్చు నాకు మహా సర్దా కలిగించేది. మోహనరాగంలో పాటలు పాడాలనిపించేది అలాంటప్పుడు.

అయితే -

వాడికి నా మీద ఎటువంటి అనుమానం రాకుండా జాగ్రత్తపడేవాణ్ణి.

వాడితో మహా క్లోజుగా మసలుకునేవాణ్ణి.

వాడికి ఇంక్రిమెంట్లొచ్చినా -

ఆఫీసర్ మెచ్చుకున్నా -

అవార్డొచ్చినా -

నేను పూనుకుని, కేంటీన్లొంట జోకులేస్తూ తిరిగే వాణ్ణి.

మా ఆవిడ్ని వాళ్ళింటికి ఆవకాయలు, కొత్తరకం ప్రపట్టాళ్ళతో పంపేవాణ్ణి.

వారానికోమాటు మా వాళ్ళతో కల్సి వాడింటికి వెళ్ళి గంటల్తరబడి బాతాఖాని కొట్టేవాణ్ణి.



అయితే మనసులో మాత్రం వాడ్నింకా ఎలా బాధించాలా అని ఆలోచన వదిలేది కాదు.

ఈ లోగా మాకు అంటే నాకు డిపార్టుమెంట్ పరీక్ష వచ్చింది.

అంటే ఇది పాసవుతే నేనో మెట్టు ఎక్కుతాను. ఇది పాసవాలంటే రామారావు మేనేజరుతో ఒక్క ముక్క అంటే చాలు.

కానీ -

అందుకు నాలో సుయోధనుడు అంగీకరించ లేదు.

సింహం ఆకలేస్తే గడ్డి తింటుందా! మదగజ కుంభస్థలం తప్ప! నాదీ అదే తత్వం.

పరీక్షకు తయారవడం కన్నా రామారావుకి ఏదైనంత పెద్ద నష్టాన్ని కలుగజేయడంలో నా మెదడ శ్రమిస్తోంది.

అవాళ సాయంత్రం ఆఫీసులో కూర్చుని అ విషయం ఆలోచిస్తూన్నాను. టైం తెలీడం లేదు.

వాడింటికి దొంగతనంగా వెళ్ళి స్టవ్ నాబ్ తి గేస్ వదిలేస్తే-

వాడి కొడుకుని, కిరాయి రౌడీల ద్వారా కిడ్నా చేయిస్తే -

సెక్షన్ ఖాళీ అవడం గమనించి నేను కూడా లే వళ్ళు విరుచుకుని, టేబిల్ సర్ది బయటికి నడ బోయేను.

మేనేజర్ గదిలోంచి మాటలు...

పిల్లిలా వెళ్ళేను... రామారావు గొంత ...

"ఈ ఛాన్సు సుబ్రమణ్యానికిస్తే బావుంటు దేమో సార్. అతను చాలా ఎఫిషియెంట్ హాండ్ అసలు నాతోపాటే ఛాన్సు రావల్సింది..."

అప్పటికే నాలో పశ్చాత్తాపం మొదలైంది. నాలో సుయోధనుడు తల వాల్చేశాడు.

నా కాళ్ళు నా ప్రమేయం లేకుండానే నన్ను బయటకు తీసుకుపోయాయి.

అయితే -

సుబ్రమణ్యానికి అంటే నాకు తెలీని విషయం వొకటుంది.

రామారావెప్పుడో సుబ్రమణ్యం దమనకుడి వేషాన్ని గ్రహించాడనీ, అందుకే అతను వినేట్లుగా మేనేజర్‌తో అలా మాట్లాడి తరువాత సుబ్రమణ్యం దుశ్చేష్టలన్నీ ఏకరువు పెట్టాడనీ సుబ్రమణ్యానికి తెలిసే అవకాశం లేదు.

ఏమైనప్పటికీ, సుబ్రమణ్యానికి రామారావిప్పుడు మంచి మిత్రుడు.

— భాగవతుల నాగమణి